సాక్షి
విశాఖపట్నం

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



మనిషికి పంది కిడ్నీ...

పంది కిడ్నీ మనిషికి మార్పిడితో సత్ఫలితాలను ఇస్తుందని డాక్టర్ వశిష్ట తాతపూడి అన్నారు. 8లో



జల్సాలకు అలవాటు పడి..

జల్సాలకు అలవాటు పడి .. బైక్ దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిలో ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో

ఇదిగో.. పిడుగు



సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎస్సీ కాలనీలో ఓ ఇంటిపై ఆదివారం పిడుగు పడింది. ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్, ఏసీ, తదితర గృహోపకరణాలు దగ్ధమైనట్లు ఇక్కడ అద్దెకు ఉంటున్న మహిళ తెలిపారు.





చెస్ సందడి

పోర్టు ఇండోర్ స్టేడియంలో ఆదివారం అండర్–11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ చాంపియన్‌షిప్ ఓపెన్ కేటగిరీలో 193 బోర్డులపై 385 మంది.. బాలికల విభాగంలో 98 బోర్డులపై 194 మంది తొలి రోజు పోటీపడ్డారు. వీరిలో కొంత మంది ఫిడే రేటెడ్ ఆటగాళ్లతో పాటు మాస్టర్స్ టైటిల్స్ సొంతం చేసుకున్న చిన్నారులు ఉన్నారు. ఈ పోటీలు వారం రోజుల పాటు జరుగుతాయి.



రైల్వే స్టేషన్‌లో చెత్తను ఊడ్చుతున్న కేంద్ర సహాయ మంత్రి దర్శనా జర్దోష్



బీచ్‌రోడ్డులో చెత్త సేకరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున

స్వచ్ఛత.. పరిశుభ్రత

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలో చేపట్టిన ఏక్ తారీఖ్.. ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వివిధ ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో నగరంలోని పలు చోట్ల శ్రమదానం నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లో కేంద్ర సహాయ మంత్రి దర్శనా జర్దోష్, ఆర్.కె.బీచ్‌లో మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, హిందూస్థాన్ షిప్‌యార్డ్ సీఎండీ ఖత్రి, కైలాసగిరిపై 198 బెటాలియన్ సిబ్బంది, నేవీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేశారు. 8లో



బీచ్‌రోడ్డులో చెత్త ఏరుతున్న షిప్‌యార్డ్ సీఎండీ ఖత్రి



కైలాసగిరిపై 198 బెటాలియన్ సిబ్బంది శ్రమదానం

న్యూస్‌రీల్

సీఐల బదిలీలు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ సిటీ వీఆర్‌లో ఉన్న ఐదుగురు సీఐలను రేంజ్ వీఆర్‌కు, విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న నలుగురు సీఐలను విశాఖ సిటీకి బదిలీ చేశారు. ఈ మేరకు విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సిటీ వీఆర్‌లో ఉన్న రంబ సత్యనారాయణ, ఏవీ లీలారావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, ఎస్.షణ్ముఖరావు, ఎస్.కాంతారావు విశాఖ రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. రేంజ్ వీఆర్‌కు చెందిన ఎస్.అమ్మినాయుడు, జి.గోవింద్‌రావు, వి.చక్రధరరావు, సీహెచ్ వాసునాయుడులను విశాఖ సిటీకి బదిలీ చేశారు.

నేడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాక

శొంఠ్యాంలో ఆయుర్వేదిక్ ఫార్మసీ ల్యాబ్‌కు శంకుస్థాపన

మహారాణిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని సోమవారం విశాఖ వస్తున్నారు. సాయంత్రం 4.05 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం శొంఠ్యాం వెళ్తారు. అక్కడ రూ.6.67 కోట్లతో నిర్మించే ఆయుర్వేదిక్ ఫార్మసీ అండ్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌కు ఆమె శంకుస్థాపన చేస్తారు. అక్కడ నుంచి విశాఖ చేరుకుని రాత్రికి బస చేస్తారు. 3న ఇసుకతోటలో కొత్తగా నిర్మించిన యూపీహెచ్‌సీ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారు. అక్కడ నుంచి పాడేరు వెళతారు.

కళాకారులకు కొత్త గుర్తింపు కార్డులు

మహారాణిపేట: కళలను, కళాకారులను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా కళాకారులకు కొత్త గుర్తింపు కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాలను, సబ్సిడీలను, సంక్షేమ కార్యక్రమాలను వినియోగించుకొనేందుకు, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉపయోగపడే విధంగా రాష్ట్రస్థాయి గుర్తింపు కార్డులను జారీ చేస్తామన్నారు. జిల్లాలోని వివిధ కళారూపాల కళాకారులు దరఖాస్తులను జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో ఈనెల 8వ తేదీ లోపు అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 9441249410 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో లింగేశ్వరరావుకు పతకాలు



సాధించిన పతకాలు, ట్రోఫీతో లింగేశ్వరరావు

ఉక్కునగరం : అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన బి.వి.ఎస్.కె. లింగేశ్వరరావుకు రెండు పతకాలు లభించాయి. సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు కువైట్‌లో కువైట్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ఛాలెంజ్ ట్రోఫీ పోటీలు నిర్వహించారు. భారత్, ఇండోనేషియా, ఖతార్, ఫిలిప్పైన్స్, కువైట్, తైవాన్, ఈజిప్ట్, దుబాయ్, బహ్రెయిన్ తదితర దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా రాష్ట్రం నుంచి లింగేశ్వరరావు ఒక్కరే ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో టీమ్ చాంపియన్‌షిప్‌లోను, 50+ డబుల్స్ పోటీల్లో లింగేశ్వరరావు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు క్రీడాకారులు, పలు సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ఎయిర్‌పోర్టులో ఎక్స్‌ట్రా పార్కింగ్

- ప్రస్తుతం 500 కార్ల నిలిపే సామర్థ్యం
- విస్తరణతో మరో 200 కార్లకు అవకాశం
- ఈ విమానాశ్రయానికి అధికమైన పాసింజర్ల తాకిడి
- గత ఆగస్టుతో పోల్చుకుంటే పెరిగిన ప్రయాణికులు



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి రానురాను ప్రయాణికుల తాకిడి అధికమవుతోంది. అందుకనుగుణంగా ఇప్పటికే ఈ ఎయిర్‌పోర్టు అవసరమైన అన్ని హంగులను సమకూర్చుకుంటోంది. వీటితో పాటు కార్ పార్కింగ్‌ను కూడా విస్తరించుకుంది. ఈ విమానాశ్రయంలో ప్రస్తుత పార్కింగ్‌లో 500 కార్లను నిలిపే సామర్థ్యం ఉంది. ఇటీవల అందుబాటులోకి వచ్చిన పార్కింగ్‌లో అదనంగా మరో 200 కార్లను ఉంచేందుకు అవకాశం కలిగింది. రోజురోజుకూ ప్రయాణికుల రాకపోకలు పెరుగుతుండడంతో వాహనాల రద్దీ కూడా తీవ్రమవుతోంది. దీంతో ఎయిర్‌పోర్టుకు వచ్చే కార్లు, ఇతర వాహనాలను నిలపడానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడేది. ఇప్పుడు అదనపు పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి రావడంతో ఆ ఇబ్బంది నుంచి వాహనదార్లకు ఉపశమనం లభించిందని విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

తగ్గిన సర్వీసులు.. పెరిగిన ప్రయాణికులు

మరోవైపు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం దేశీయ (డొమెస్టిక్) ప్రయాణికుల రాకపోకల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఇతర ఎయిర్‌పోర్టులకంటే ఈ విమానాశ్రయం నుంచే ఎక్కువ మంది వెళ్లి వస్తున్నారు. 2022–23లో విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, కడప, తిరుపతి, కర్నూలు విమానాశ్రయాల నుంచి 48,25,904 మంది డొమెస్టిక్ పాసింజర్లు రాకపోకలు సాగించగా, వీరిలో ఒక్క విశాఖ ఎయిర్‌పోర్టు నుంచే 24,35,320 మంది ఉన్నారు. ఇక గత ఏడాది ఆగస్టుతో పోల్చితే ఈ ఆగస్టులో విమాన సర్వీసులు తగ్గినప్పటికీ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ఆగస్టులో ఈ ఎయిర్‌పోర్టు నుంచి 1,770 విమానాల ద్వారా 2,03,795 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ ఆగస్టులో 1,722 విమాన సర్వీసుల ద్వారా 2,41,917 మంది ప్రయాణించారు. అంటే 48 విమాన సర్వీసులు తగ్గినా, 38,122 మంది ప్రయాణికులు పెరిగారన్న మాట!

ఆక్యుపెన్సీలో హైదరాబాద్ టాప్

ఈ ఏడాది ఆగస్టులో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ప్రయాణికుల ఆక్యుపెన్సీ హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కతా సెక్టార్ల విమాన సర్వీసులకు ఎక్కువగా ఉంది. విశాఖపట్నం–హైదరాబాద్‌ల మధ్య తిరిగే విమానాల్లో సీటింగ్ కెపాసిటీ 44,752కి గాను 42,038 మంది (93.94 శాతం) ప్రయాణించారు. విశాఖ–ఢిల్లీల మధ్య సర్వీసులకు 21,642 మంది సీటింగ్ సామర్థ్యం ఉండగా 19,542 మంది (90.30 శాతం) రాకపోకలు సాగించారు.

ఆగస్టులో ఈ ఎయిర్‌పోర్టు నుంచి సెక్టార్ల వారీ ప్రయాణికుల ఆక్యుపెన్సీ

ఎక్కడకు?	సామర్థ్యం	ప్రయాణికులు	ఆక్యుపెన్సీ (శాతం)
హైదరాబాద్	44,752	42,038	93.94
ఢిల్లీ	21,642	19,542	90.30
బెంగళూరు	26,274	23,028	87.65
ముంబై	12,462	10,800	86.66
చెన్నై	14,400	11,587	80.47
కోల్‌కతా	3,600	3,268	90.78

అన్ని పార్టీలు కలిసినా విజయం మనదే



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కోలా గురువులు, బాలరాజు తదితరులు

- ప్రతిపక్షాలను ప్రజలు విశ్వసించడం లేదు
- బాబు తప్పు చేయబట్టే జైలుకెళ్లాడు
- అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించండి
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

ఆనందపురం : వివిధ పార్టీల నాయకులు స్వప్రయోజనాల కోసం కలిసిపోయి ఎన్నికల్లో పోటీ చేసినా ప్రజాభిమానం ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడం వారి తరం కాదని వైఎస్సార్ సీపీ రీజినల్ కో – ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడడంతోనే జైలుకెళ్లారని వివరించారు. అన్యాయంగా కేసులు పెట్టారని ప్రజల్లో సానుభూతి కోసం టీడీపీ, జనసేన నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవినీతి కేసులో జైలుకెళ్లిన చంద్రబాబుతో కలిసి పని చేస్తామని చెబుతున్న పవన్ కల్యాణ్‌కు... ఆ అవినీతిలో భాగం ఉన్నట్టు స్పష్టమవుతోందన్నారు. చంద్రబాబు హామీలిచ్చి ప్రజలను ఎలా మోసం చేశారు..., జగన్‌మోహన్‌రెడ్డి ఎలా అమలు పరిచారో అందరికీ తెలియజేయాలన్నారు. భీమిలి నియోజకవర్గంలో అత్యధికంగా 40 వేల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు అందించగలిగామని వివరించారు. పార్టీకి మొదటి నుంచి పని చేస్తున్నవారికి గుర్తింపు, సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 100 సచివాలయాల్లో నిర్వహించి రికార్డు సాధించారని చెప్పారు. మరలా అతనినే భీమిలి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన చంద్రబాబు జైలు శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. ప్రజా సేవకే అంకితమైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ న్యాయం చేస్తారని, మరలా పార్టీని అధికారంలోకి తేవడానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని పార్టీలు ఒక వర్గం, జగన్‌మోహన్‌రెడ్డి ఒక వర్గంగా రాష్ట్రంలో రాజకీయంగా సాగుతోందని... రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం ప్రాంతీయ సమన్వయకర్త ముత్తంశెట్టి శివనందీష్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు బాలరాజు, భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీలు వాసురాజు, కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, సుంకరి గిరిబాబు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, పార్టీ భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల అధ్యక్షులు గాడు శ్రీను, బంక సత్యనారాయణ, కోరాడ లక్ష్మణ్, నాయకులు మజ్జి వెంకటరావు, పిళ్లా సుజాత, బంటుబిల్లి మణిశంకర్ నాయుడు, బోని బంగారు నాయుడు, పాండ్రంకి అప్పారావు, పోతిన శ్రీను, ఈర్ల ఈశ్వరరావు, శిర్ల కరుణాకర్‌రెడ్డి, పోతిన హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో వసూళ్ల పర్వం

- ప్రైవేట్ స్కూళ్ల రెన్యువల్స్‌లో అవకతవకలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యాశాఖ మంత్రి
- ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్‌పై సరెండర్ వేటు
- సమగ్ర విచారణకు ఆదేశించిన విద్యాశాఖ కమిషనర్

విశాఖ విద్య: విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయం కేంద్రంగా సాగుతున్న వసూళ్ల పర్వంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఇందుకు బాధ్యుడిగా కార్యాలయ సూపరింటెండెంట్ ఆనంద్‌రెడ్డిని కమిషనరేట్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఆర్జేడీ జ్యోతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఈ విషయం వెలుగులోకి రావడంతో విద్యాశాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఏడాది నుంచి ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు, రెన్యువల్ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. భవిష్యత్‌లో అంతా ఆన్‌లైన్ విధానంలోనే ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నందున, ఇందుకు 2023–24 విద్యా సంవత్సరం నుంచే అమలుకు విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు ఎంఈవో, డిప్యూటీ డీఈవో సిఫార్సుతో ప్రైవేట్ స్కూళ్ల నిర్వహణకు డీఈవో కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. హైస్కూళ్లకు అయితే డిప్యూటీ డీఈవో, డీఈవో కార్యాలయ స్థాయిలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసి.. స్కూళ్ల నిర్వహణకు అఫిలియేషన్‌ను ఆర్జేడీ ఇస్తారు. ఇదంతా పారదర్శకంగా చేపట్టాలని ఉన్నతాధికారులు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే విద్యాశాఖలోని కొంతమంది అధికారులు, ఉద్యోగులు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఇటీవల కాలంలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్జేడీ కార్యాలయంలో డబ్బులు ఇస్తేనే ఫైలు ముందుకెళ్తోందని, స్కూళ్లను బట్టి గుర్తింపు, రెన్యువల్‌కు రేటు నిర్ణయించి.. డబ్బులు ఇవ్వనదే పనిచేయడం లేదని కొంత మంది ప్రైవేట్ స్కూళ్ల యాజమానులు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్జేడీ కార్యాలయ అధికారులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ రంగంలోకి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం సూపరింటెండెంట్ ఆనంద్ రెడ్డిని కమిషనరేట్‌కు సరెండర్ చేసినట్లు ఆర్జేడీ జ్యోతి కుమారి 'సాక్షి'కి తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ మాజీ కార్పొరేటర్



టీడీపీ మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబుని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి

ఆనందపురం : జీవీఎంసీ 4వ వార్డు టీడీపీ మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. పెద్దిపాలెంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు.. సోంబాబును సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితుడునై అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నాయకత్వంలో భీమిలిలో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

ఉత్సాహంగా ద్విగళ అష్టావధానం

మధురవాడ: సాహిత్య, సంఖ్యామాన, పురాణాలకు సంబంధించిన పలు ప్రశ్నలకు తమదైన శైలిలో సమాధానాలు చెబుతూ, చిక్కుముడులు విప్పుతూ సభికుల హర్షధ్వానాలు అందుకున్నారు కోట బొమ్మాళికి చెందిన ఉభయ కళాతపస్వి సుసరాపు చంద్రశేఖర శర్మ అవధాని, రంప సాయికుమార్ శర్మ. వీరిరువురు ఒకే వేదికపై ఒక ప్రశ్నకు రెండు రకాల సమాధానాలు చెబుతూ పలువురి మన్ననలు పొందారు. మధురవాడ మారుతీ విప్ర సేవా సమితి ఆధ్వర్యంలో కొమ్మాది త్రిశక్తి ఫంక్షన్ హాలులో వినూత్న సాహిత్య, సరస్వత ద్విగళ అష్టావధానం ఉత్సాహపూరిత వాతావరణంలో ఆదివారం నిర్వహించారు. సభా సంచాలకులు సాహిత్యరత్న బంకుపల్లి రమేష శర్మ ఆధ్వర్యంలో పలువురు సభికులు, బ్రాహ్మణులు, సాహితీ అభిమానులు తేదీలు చెప్పి వారం పేర్లు చెప్పమని, సాహిత్యానికి చెందిన, ఆధ్యాత్మిక ఇతర అంశాల ప్రశ్నలతోపాటు ధర్మ సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అవధాన విద్యా పరిషత్ అధ్యక్షులు మరుమాముల దత్తాత్రేయశర్మ, హైదరాబాద్‌కు చెందిన అవధాని సురభి శంకరశర్మ, దార్లపూడి సత్యప్రసాద్ శర్మ, జొన్నగడ్డల శ్రీనివాసరావు, రేజేటి నరసింహమూర్తి శర్మ, సంస్కృతాంధ్ర పండితులు సర్వజ్యోశ్యుల గౌరీ శంకరశాస్త్రి, తెలుగు పండితులు అన్నాజీ శర్మ, సమితి ప్రతినిధులు జ్యోశ్యులు వెంకట శివప్రసాదశర్మ, వేమకోటి పద్మనాభ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ స్పందన రద్దు

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం గాంధీ జయంతి కారణంగా ఈ సోమవారం రద్దు చేసినట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన కోసం దూర ప్రాంతాల నుంచి ఎవరూ రావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వచ్చే సోమవారం నుంచి ఈ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు.



25వ వార్డు పల్ల దాముడమ్మకు వితంతువు పింఛను అందజేస్తున్న వలంటీర్ పద్మజ



సీతంపేట గొల్లవీధిలో పింఛన్ అందుకున్న దివ్యాంగురాలు బల్ల సరోజిని



జీవీఎంసీ 27వ వార్డు అమర్‌నగర్ వద్ద కునిశెట్టి జగదీష్‌కు దివ్యాంగుల పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గౌతమి

తొలి రోజు 76.56 శాతం పింఛన్ల పంపిణీ

మహారాణిపేట : జిల్లాలో తొలిరోజు 76.31 శాతం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 1,65,665 లక్షల మందికి వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు ఉన్నాయి. ప్రభుత్వం రూ.46 కోట్ల 54 లక్షల 57 వేలు కేటాయించింది. తొలిరోజు ఆదివారం రాత్రి 9 గంటల సమయానికి 1,26,417 మందికి (76.56 శాతం) రూ.35.50 కోట్ల మేర పింఛన్లు అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తెలిపారు. ఐదు రోజుల్లో మొత్తం ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆమె.. స్వచ్ఛతకు అంబాసిడర్!



ఆమెకు మన భాష రాదు. స్వస్థలమేదో తెలీదు. మానసిక వ్యాధితో బాధపడుతోంది. రైల్వే న్యూకాలనీ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న ఫుట్‌పాత్ ఆవాసం. ఎవరైనా దయతలచి ఇస్తే తిని, అక్కడే ఉంటుంది. ప్రతి రోజూ ఉదయాన్నే చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేస్తుంది. నీళ్లు చల్లి ముగ్గులు పెడుతుంది. ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా ప్రజలు ఆదివారం గంట పాటు ఊరూవాడా పరిసరాల పరిశుభ్రతకు నడుం బిగించారు. ఈమె ఎప్పుడో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. వంచిన నడుం పైకెత్తకుండా ఏకబిగిన రోడ్డుపైనున్న చెత్తను ఊడ్చి పడేస్తుంది. తను చేస్తున్న పనిపై అవగాహన లేకున్నా.. పరిసరాలను పరిశుభ్రం చేసి సమాజానికి గొప్ప సందేశం ఇస్తోందని అటు వైపు వెళ్లేవారు అంటున్నారు.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- అండర్–11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ ప్రారంభం



ఫిడే మాస్టర్ సాహితీతో ఎత్తుకు పైఎత్తుకు వేస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



చదరంగం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

విశాఖ స్పోర్ట్స్: విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన విద్య, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్యం, యువత మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం అండర్–11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను అందించి ప్రోత్సహిస్తోందన్నారు. విశాఖలో అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన ప్రారంభిస్తుండటంతో.. విశాఖలో మరిన్ని వసతుల కల్పనతో పాటు అభివృద్ధి వేగవంతం కానుందన్నారు. విశాఖ వేదికగా జాతీయ స్థాయిలో చదరంగం పోటీలు నిర్వహించడం... ఇక్కడ నుంచే ఆలనా మీనాక్షి, సాహితీ వర్షిణి లాంటి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. అనంతరం ఫిడే మాస్టర్ టైటిల్ సొంతం చేసుకున్న సాహితీ వర్షిణితో తొలి మూవ్ వేసి చాంపియన్‌షిప్‌ను ప్రారంభించారు. టాప్ బోర్డుపై ఆడుతున్న ఫిడే రేటెడ్ క్రీడాకారులతో పాటు పోటీకి సిద్ధపడిన పలువురి చిన్నారులను సుబ్బారెడ్డి పరిచయం చేసుకుని వారిలో ఉత్సాహం నింపారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌కాప్ చైర్మన్ కె.కె.రాజు, ఆంధ్రా చెస్ సంఘం అధ్యక్షుడు కె.వి.వి.శర్మ, రాష్ట్ర, జిల్లా చదరంగం ప్రతినిధులు, టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ చాంపియన్‌షిప్ ఓపెన్ కేటగిరీలో 193 బోర్డులపై 385 మంది.. బాలికల విభాగంలో 98 బోర్డులపై 194 మంది తొలి రౌండ్‌లో పోటీపడ్డారు. వీరిలో కొంత మంది ఫిడే రేటెడ్ ఆటగాళ్లతో పాటు మాస్టర్స్ టైటిల్స్ సొంతం చేసుకున్న చిన్నారులు ఉన్నారు.

ఎత్తుకు పైఎత్తులు



విశాఖ స్పోర్ట్స్: అండర్–11 జాతీయ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో రేటెడ్ ఆటగాళ్లు విజయాలతో తొలి రౌండ్‌ను ముగించి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. ఎరీనా ఫిడే మాస్టర్(ఏఎఫ్‌ఎం) హన్షిత్, ఎరీనా క్యాండిడేట్ మాస్టర్లు(ఏసీఎం) కపిల్ నితిన్, రైవాన్ తొలి రౌండ్‌లో ఓటమితో వెనుకబడ్డారు. టోర్నీ టాపర్‌గా బరిలోకి దిగిన కర్నాటక చిన్నారి అపార్, ఏఎఫ్‌ఎంలు పవన్, ఆరవ్, పరంబ్రాతా, యువనేష్, ఆద్యాన్ తొలి రౌండ్‌లో విజ యం సాధించారు. ఏసీఎంలు జలకాష్, విశృత్, బాలానందన్, తవిష్, కార్తికేయ, స్వయమ్, క్యాండిడేట్ మాస్టర్(సీఎం) వివాన్, ఎరీనా ఇంటర్నేషనల్ మాస్టర్(ఏఐఎం) సయిద్, ఆదిక్ తొలి రౌండ్‌లో సత్తా చాటి రెండో రౌండ్‌కు సిద్ధమయ్యారు.

సత్తాచాటుతున్న ఆముక్త: టాప్‌సీడ్ ఆముక్త రెండో రౌండ్‌లోనూ విజయం సాధించి మూడోరౌండ్‌కు చేరింది. తొలిరోజు రెండు రౌండ్లు జరగ్గా దీక్షిత, శ్రావ్యశ్రీ, హన్య, షార్వానిక విజయాలతో కొనసాగుతున్నారు. ఓపెన్‌లో టాప్‌సీడ్ అపార్... అధిరుత్‌తో రెండో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. వివాన్, నందన్, సయ్యద్, సిద్ధార్థ్ రెండో రౌండ్‌లో విజయాలతో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఏఎఫ్‌ఎం పవన్ రెండో రౌండ్‌ను శ్రీహరితో డ్రాగా ముగించాడు.

టోర్నీ టాపర్‌గా బరిలోకి..



కర్నాటక నుంచి ఈ టోర్నీలో పాల్గొనేందుకు వచ్చాను. 2067 ఫిడే రేటింగ్‌తో టోర్నీ టాపర్‌గా అవకాశం వచ్చింది. స్టాండర్డ్ చెస్‌తో పాటు ర్యాపిడ్, బ్లిట్జ్ చదరంగంలోనూ పోటీపడుతుంటాను. జాతీయస్థాయిలో యాక్టివ్ ప్లేయర్స్ లిస్టింగ్‌లో 369వ ర్యాంక్‌లో ఉన్నాను. టాప్ ర్యాంక్‌ను కొనసాగిస్తూ ఫిడే రేటింగ్‌ను మెరుగుపరుచుకుంటాను.

– అపార్, ఓపెన్ టోర్నీ టాప్ ర్యాంకర్

విజయంతో టోర్నీ మొదలు



ఓపెన్‌తో పాటు బాలికలకు ప్రత్యేకంగా ఈ టోర్నీ జరుగుతోంది. ప్రస్తుతం 1615 రేటింగ్‌తో బాలికల్లో టాప్ ర్యాంక్‌తో తొలి రౌండ్ ప్రారంభించాను. చదరంగంపై ఆసక్తితోనే ఈ స్థాయికి చేరాను. తొలి రౌండ్‌లో తమిళనాడుకు చెందిన అభిగలిపై విజయంతో టోర్నీ మొదలుపెట్టాను. మొత్తంగా స్విస్ పద్ధతిలో 11 రౌండ్ల టోర్నీ ఇది. బాలికల కేటగిరీలోనూ ఎరీనా ఫిడే మాస్టర్లు నలుగురు, ఎరీనా క్యాండిడేట్ మాస్టర్లు ఒకరు పోటీపడుతున్నారు. వారితో రానున్న రౌండ్లలో పోటీపడాల్సి ఉంటుంది.

–ఆముక్త, బాలికల టోర్నీ టాప్ ర్యాంకర్

ఆంధ్రా నుంచి టాపర్‌ను..



ఏపీ ఆటగాళ్లలో మెరుగైన ఫిడే రేటింగ్ 1568తో 17వ బోర్డ్‌పై ఆడే అవకాశం దక్కింది. తొలి రౌండ్‌లో తెలంగాణకు చెందిన కౌశిక్‌పై విజయంతో శుభారంభం చేశాను. రెండో రౌండ్‌లో కర్నాటకకు చెందిన అథర్వ్‌తో పోటీపడనున్నాను. అతని కంటే మెరుగైన రేటింగ్‌తో తలపడనుండటంతో విజయావకాశం ఉంది.

– హేమల్ వర్షణ్, ఓపెన్‌లో ఏపీ టాపర్

మనిషికి పంది కిడ్నీ మార్పిడితో సత్ఫలితాలు

కొమ్మాది: పంది కిడ్నీ మనిషికి మార్పిడితో సత్ఫలితాలను ఇస్తుందని న్యూయార్క్‌లో గల లాంగోన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ వశిష్ఠ తాతపూడి అన్నారు. బీచ్‌రోడ్డు రాడిసన్ బ్లూలో ఏపీ సొసైటీ ఫర్ నెఫ్రాలజీ రాష్ట్ర సదస్సులో భాగంగా రెండో రోజు ఆదివారం అమెరికా నుంచి వర్చువల్‌గా ఆయన మాట్లాడారు. పిగ్ టు హ్యూమన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై మాట్లాడుతూ జన్యుపరంగా మార్పు చెందిన పంది కిడ్నీని మనిషికి మార్పిడి చేశామన్నారు. రెండు నెలల వరకు కిడ్నీ బాగా పనిచేసిందన్నారు. ప్రస్తుతం ఉన్న అవయవాల కొరత భవిష్యత్తులో మరింత పెరగవచ్చని, అందువల్ల ఇటువంటి ప్రయోగాలు మరిన్ని చేయాల్సి ఉందని వివరించారు. అనంతరం శ్యామ్ బన్సల్, వివేక్ కూటే మాట్లాడుతూ కిడ్నీ మ్యాచింగ్ టెక్నిక్, జత చేసిన అవయవ మార్పిడిపై ప్రసంగించారు. డాక్టర్లు నికేష్ కామత్, గోపికా మీనన్, ఆశీష్‌కు ఉత్తమ సైంటిఫిక్ పేపర్ అవార్డులు అందజేశారు. సదస్సులో ఏపీ నలుమూలల నుంచి 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ సభ్యత్వ దరఖాస్తుకు నేడే ఆఖరు

మహారాణిపేట : జర్నలిస్టుల కోరిక మేరకు విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఒక రోజు పొడిగించారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 2006 నుంచి 2023 వరకు అక్రిడేషన్ ఉన్న వారు సోమవారం దరఖాస్తులు అందజేయాలని సొసైటీ అధ్యక్షుడు బి.రవికాంత్, కార్యదర్శి వై.శ్రీనివాస్ కోరారు.



దరఖాస్తులు సమర్పిస్తున్న మహిళా జర్నలిస్ట్

అప్పన్నను దర్శించుకున్న కేంద్ర సహాయ మంత్రి



మంత్రికి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆదివారం కేంద్ర రైల్వే, టెక్స్‌టైల్స్ శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాన్ని సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందించారు. పీఆర్వో అప్పలనాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మేయర్ గొలగాని హరివెంకటకుమారి



మాట్లాడుతున్న మేయర్ హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. ఆర్.కె.బీచ్‌లో ఆదివారం నిర్వహించిన ఏక్ తారీఖ్–ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛభారత్ మిషన్ ఏర్పాటై తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. విశాఖ నగరానికి ఎంతో మంది పర్యాటకులు వస్తుంటారని.. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రతకు కట్టుబడి ఉన్నట్లు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తీరంలో వ్యర్థాలు సేకరించి పారిశుధ్య కార్మికులకు అందించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ సన్యాసిరావు, మిస్ సౌత్ ఇండియా 2022 చరిష్మా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకుందాం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముస్తక్ అహ్మద్

కొమ్మాది: వారసత్వ సంపదను పరిరక్షించుకుని.. భావితరాలకు అందించాలని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ముస్తక్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మంగమారిపేట శిలా తోరణం వద్ద ఆదివారం నిర్వహించిన ఏక్ తారీఖ్ ఏక్ గంట శ్రమదాన్‌లో ఆయన పాల్గొన్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన శిలా తోరణాన్ని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పరిరక్షించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బీచ్‌లో వ్యర్థాలను తొలగించారు. రీజినల్ డైరెక్టర్ బిదిషా గుప్తా, జోనల్ కమిషనర్ రాము, నేవీ అధికారులు పాల్గొన్నారు.

పోర్టులో స్పెషల్ క్యాంపెయిన్

మహారాణిపేట: విశాఖపట్నం పోర్టు అథారిటీలో ఆదివారం స్వచ్ఛ భారత్ అభియాన్ స్పెషల్ క్యాంపెయిన్ 3.0 ప్రారంభమైంది. ఈ నెల 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. డాక్ ఏరియాలో జరిగిన ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రం చేసేందుకు గంట సమయాన్ని కేటాయించాలన్నారు. పోర్టు పరిసరాల్లో గాలి కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డాక్ ఏరియాతోపాటు పోర్టులోని ఆర్‌అండ్‌డీ యార్డు, సిగ్నల్ స్టేషన్, గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిలో శ్రమదానం జరిగింది. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, శబరిమలి, సింగపూర్‌కు చెందిన నౌకల సిబ్బంది పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో..

సింధియా: మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగులు నడుచుకోవాలని హిందూస్థాన్ షిప్‌యార్డ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి పిలుపునిచ్చారు. ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం ఎదురుగా ఉన్న తీరంలో షిప్‌యార్డ్ కార్మికులు, ఉద్యోగులు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్ ఖత్రి మాట్లాడుతూ సంస్థలో ప్రతి నెలా స్వచ్ఛభారత్ చేపడుతున్నామని.. పరిశుభ్రతలో ఉత్తమ విభాగానికి బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు. డైరెక్టర్ పర్సనల్ జె.సి గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత నావికాదళం ఆధ్వర్యంలో..

సింధియా: భారత నావికాదళం ఆధ్వర్యంలో విశాఖలోని వివిధ నావికాదళ యూనిట్లలో నేవీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. నేవీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా నేతృత్వంలో వీరంతా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఆర్.కె.బీచ్‌లో సుమారు 800 మంది సిబ్బంది, భీమిలి బీచ్‌లో 400 మంది, యారాడ బీచ్‌లో 700 మంది సిబ్బంది పాల్గొని తీర ప్రాంతాలను శుభ్రపరిచారు.

సాగర్‌నగర్ బీచ్‌లో..

మహారాణిపేట: సాగర్‌నగర్ బీచ్(జూ పార్కు ఎదురుగా)లో కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ కార్యాలయం సిబ్బంది, వైజాగ్ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సిబ్బంది ఆదివారం శ్రమదానం నిర్వహించారు. కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్ ఆధ్వర్యంలో సిబ్బంది తీరంలో వ్యర్థాలను తొలగించారు. సీజీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ సిబ్బంది జూ పార్కు లోపల శుభ్రం చేశారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న పోర్టు సిబ్బంది



ఐఎన్ఎస్ డేగా పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేస్తున్న నేవీ సిబ్బంది



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ సిబ్బంది

జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలు

- 10 మోటారు సైకిల్స్ స్వాధీనం



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ గంధం నాగన్న

అల్లిపురం: జల్సాలకు అలవాటు పడ్డారు. ఈజీమనీపై దృష్టిసారించారు. పైగా ఎలక్ట్రీషియన్లు కావడంతో బైక్ దొంగతనాలు సులువుగా చేసుకుంటూ పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. పాపం పండింది. ఇద్దరు యువకుల్లో ఒకరు విశాఖ పోలీసులకు దొరికిపోయాడు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నగర క్రైం డీసీపీ గంధం నాగన్న తెలిపిన వివరాలు..

కోనసీమ అంబేడ్కర్ జిల్లా మామిడికుదురు మండలానికి చెందిన రొక్కం పవన్‌కుమార్, మేడిద శ్రీనివాసరావు అలియాస్ కుక్క పండు ఇద్దరూ కొబ్బరికాయల వ్యాపారులు. వీరిద్దరు అమలాపురంలో కొబ్బరికాయలు కొని వేరే ప్రాంతాల్లో అమ్మేవాళ్లు. వ్యాపారంలో శ్రీనివాసరావు చాలామందిని మోసం చేశాడు. జల్సాలకు అలవాటు పడిన వారిద్దరు మోటారు సైకిళ్ల దొంగతనానికి పాల్పడేవారు. ఇద్దరు ఎలక్ట్రీషియన్లు కావడంతో తాళాలు లేకుండానే మోటార్ సైకిళ్లను సులువుగా దొంగతనం చేసేవాళ్లు. ఆంధ్ర, తెలంగాణలో మొత్తం 10 ద్విచక్రవాహనాలు దొంగతనం చేశారు. వాటిలో 7 వాహనాలు రాయల్ ఇన్‌ఫీల్డ్ వాహనాలు కావడం విశేషం.

మద్రిపాలెం, భాస్కర్ గార్డెన్స్‌లో నివసిస్తున్న వద్దా యశ్వంత్ ఆగస్టు 27వ తేదీ రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో రాయల్ ఇన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ తన ఇంటి ముందు పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, నగర క్రైం డీసీపీ జి.నాగన్న, ఏడీసీపీ గంగాధర్‌తో పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ జి.అప్పారావు తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితులు కోనసీమ అంబేడ్కర్ జిల్లా, మామిడికుదురు మండలానికి చెందిన రొక్కం పవన్‌కుమార్, మేడిద శ్రీనివాసరావు అలియాస్ కుక్క పండుగా గుర్తించారు. సెప్టెంబర్ 25వ తేదీన మద్రిపాలెం, రైల్వే స్టేషన్‌రోడ్డులో పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి సుమారు రూ.18 లక్షలు విలువ చేసే ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు మేడిద శ్రీను పరారీలో ఉన్నాడని డీసీపీ నాగన్న ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధి..

మల్కాపురం, కేంద్రీయ విద్యాలయం గేటు ముందు ఆగస్టు 17న మల్కాపురం, శెట్టిబలిజ వీధికి చెందిన సరిపల్లి శ్రీనివాసరావు తన స్కూటీని పార్క్ చేసి స్కూల్ లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి స్కూటీ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనానికి పాల్పడింది ఎంవీపీ కాలనీకి, వాసవానిపాలేనికి చెందిన దిలీప్‌కుమార్, మరో ఇద్దరు మైనర్లుగా పోలీసులు గుర్తించారు. వీరంతా చెడు తిరుగుళ్లకు అలవాటు పడ్డారు. తిరిగేందుకు టూవీలర్ లేకపోవడంతో స్కూటీ దొంగతనానికి పాల్పడ్డారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు మైనర్లను హోంకు తరలించారు. వారి నుంచి స్కూటీ స్వాధీనం చేసుకున్నారు.

న్యూ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో..

జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను న్యూపోర్టు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనకాపల్లి జిల్లా, కే.కోటపాడు మండలం, గొండుపాలెం గ్రామానికి చెందిన బండారు సూర్య భాస్కరరావు సెప్టెంబర్ 24వ తేదీన మధ్యాహ్నం 4 గంటల సమయంలో పెదగంట్యాడ, సంజీవనగర్ కాలనీ, మేయర్ కల్యాణమండపం దగ్గర తన హీరో హోండా బైక్‌ను పార్క్ చేసి తన బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి 5 గంటలకు వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. బాధితుడు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గత నెల 27వ తేదీన పెదగంట్యాడ వద్ద అదుపులోకి తీసుకుని వారి నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పద్మనాభం పోలీస్ స్టేషన్ పరిధిలో..

మెకానిక్ షాపులో రిపేరు నిమిత్తం ఇచ్చిన తన హీరో గ్లామర్ మోటార్ సైకిల్ పోయిందని పద్మనాభం మండలం, అనంతవరం గ్రామానికి చెందిన కసిరెడ్డి వెంకటరమణ జూన్ 30న ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, బుర్జిపేటకు చెందిన కెల్లా మనికంతగా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

సిబ్బందికి అభినందనలు..

నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని క్రైం డీసీపీ గంధం నాగన్న, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తరపున నగదు అవార్డులు అందజేసి అభినందించారు.

ఈ సమావేశంలో క్రైం డీసీపీ గంధం నాగన్న, క్రైం ఏడీసీపీ డి.గంగాధరం, క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు, నార్త్ క్రైం సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్, ఎస్.ఐ ఆర్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.